సాక్షి
జోగుళాంబ గద్వాల
శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



సరిహద్దు పోలీసుల భేటీ
నాగర్‌కర్నూల్ సరిహద్దు జిల్లాల పోలీసు అధికారుల సమావేశం కల్వకుర్తిలో జరిగింది.

వివరాలు 8లో ▸



నిమజ్జనం.. ప్రారంభం
బీచుపల్లి సమీపంలోని కృష్ణానదిలో శుక్రవారం గణనాథులను నిమజ్జనం చేశారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /23.3

వాతావరణం
ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

ఎడాపెడా విద్యుత్ కోతలు

మరమ్మతు పేరిట గంటల తరబడి అంతరాయం
- వర్షం కురిసినా.. గాలి వీచినా అంతే సంగతులు
- ఇబ్బందుల్లో వినియోగదారులు



గద్వాల అర్బన్: సబ్‌స్టేషన్ల మరమ్మతులు.. చెట్టుకొమ్మల తొలగింపు.. కొత్త స్తంభాల ఏర్పాటు.. విద్యుత్ లైన్ల మరమ్మతు.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు.. ఓవర్‌లోడ్‌తో కాలిన ట్రాన్స్‌ఫార్మర్లు.. చివరికి వర్షం.. ఇలా కారణం ఏదైనా గంటల తరబడి విద్యుత్ కోతలు మామూలైపోయాయి. గద్వాల విద్యుత్‌శాఖ డివిజినల్ పరిధిలో ఎడాపెడా విద్యుత్ కోతలతో జనం అల్లాడుతున్నారు. సాంకేతిక కారణాలు, చెట్టుకొమ్మల తొలగింపు పేరుతో అదనంగా కోతలు విధిస్తుండడం వినియోగదారులకు పెద్ద పరీక్షగా మారింది. దీనికితోడు చిన్నపాటి వర్షం కురిసినా.. గాలి వీచినా కరెంట్ కట్ చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. విద్యుత్ సరఫరాలో అనేక లోపాలు ఉన్నప్పటికి రూ.వేలకు వేలు బిల్లులు వసూలు చేస్తున్నారని వినియోగదారులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ మండలాల్లోనే అత్యధికం..

గద్వాల, ధరూరు, కేటిదోడ్డి మండలాల పరిధిలో అత్యధికంగా ఏదో సాకుతో విద్యుత్ కోతలు విధిస్తున్నారు. వ్యవసాయం, గృహాలు, కమర్షియల్ సర్వీసులకు విద్యుత్ సరఫరాను ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు సరఫరా చేస్తుండగా.. అనంతరం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. చిన్న ఫీడర్ అయినా, పెద్ద ఫీడర్ అయినా ఐదారు గంటల పాటు సరఫరాను నిలిపిస్తున్నారు. ఇక కొన్నిసార్లు అయితే ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడం అటు చిన్న పిల్లలు, వృద్ధులు, ఇటు వ్యాపార వర్గాలకు ఇబ్బందులు తప్పడం లేదు.

సాంకేతిక కారణాలతోనే..

విద్యుత్ లైన్లు సరిచేయడం, కొన్ని సార్లు ఎమ్మర్జెన్సీ తదితర కారణాలతో ఎల్‌సీ తీసుకుంటాం. సబ్ స్టేషన్లలో సాంకేతిక సమస్యల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. సమస్యలు వచ్చినప్పుడే విద్యుత్ సరఫరాను నిలిపిస్తున్నాం. మా ఉద్దేశం ప్రజలను ఇబ్బంది పెట్టాలని కాదు.

– రమేష్ బాబు, ట్రాన్స్‌కో ఏడీఈ

జిల్లా వ్యాప్తంగా కోతలు ఇలా..

- ఈ ఏడాది జూలై 8, 17వ తేదీల్లో గద్వాలలోని పాతహౌసింగ్ బోర్డు, ప్రభుత్వాసుపత్రి, అంబేద్కర్ చౌక్, సెకండ్ రైల్వేగేటు, రాజీవ్‌మార్గ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.
- ఆగస్టు 8, 13 తేదీల్లో పట్టణ శివారులోని డ్యాం రోడ్డులో ఉన్న 33కేవీ పరిధిలో మరమ్మతుల కారణంగా పట్టణంలోని గంజిపేట, గాంధీచౌక్, రాంనగర్, రాఘవేంద్ర కాలనీ, తెలుగుపేట, కుంటవీధి, సుంకులమ్మ మెట్టు తదితర కాలనీలకు ఉదయం 6గంటల నుంచి 9:30గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.
- ఆగస్టు 29న ధరూరు మండలం మార్లబీడు సమీపంలోని 33/11కేవీ సబ్ స్టేషన్‌లో 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున బురెడ్డిపల్లి, ర్యాలంపాడు, ఓబులోనిపల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.
- సెప్టెంబర్ 17న గద్వాల శివారులోని డ్యాం రోడ్డులో ఉన్న 33కేవీ పరిధిలో మరమ్మతుల కారణంగా పాతహౌసింగ్ బోర్డు, రాంగనగర్, వేదనగర్, రాఘవేంద్ర కాలనీ, తెలుగుపేట, కుంట వీధి, బీడీ కాలనీ తదితర కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.
- సెప్టెంబర్ 22న పట్టణ పరిధిలోని 132కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహణ పనులు చేయాల్సి ఉందని ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు నర్సందోడ్డి, ఉప్పేరు, శెట్టి ఆత్మకూర్ ఉపకేంద్రాల పరిధిలో ఉండే గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

ఇలా ఒకట్రెండు రోజుల్లో ఒకసారి మరమ్మతులు అంటూ, మరీ కొన్నిసార్లలైతే వారంలో రెండు సార్లు సాంకేతిక కారణాలు, చెట్ల తొలగింపు ఇతర మరమ్మతులల పేరిట విద్యుత్ సరఫరాను నిలిపివేయడం పట్ల వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్‌తో కాలిపోయిన క్రమంలో ఇబ్బందులు వర్ణనాతీతం. వాటిని వెంటనే మరమ్మతు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించి గంటల కొద్ది సరఫరా నిలిపివేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీంతో వినియోగదారులకు ఏ ప్రాంతాల్లో ఎప్పుడు సరఫరా నిలిపివేస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. విద్యుత్ లైన్లను ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను గుర్తించి ముందుగానే తొలగించకపోవడంతో లెంత్ ఆఫ్ లైన్లు ఉండడం, మరమ్మతు చేసిన క్రమంలో సరిగ్గా చేయకపోవడం తదితర కారణాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు తెలుస్తోంది. ఒక ఏరియాలో ఏర్పడిన విద్యుత్ సమస్యను శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు చేయాలని.. ఎడాపెడా విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

జూనియర్ సివిల్ జడ్జిగా వెంకటపూజిత

గద్వాల క్రైం: గద్వాల జూనియర్ సివిల్ జడ్జిగా వెంటకపూజితను నియమిస్తు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ భవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటపూజిత ప్రస్తుతం వరంగల్ జిల్లా హన్మకొండ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

అంజన్న సన్నిధిలో వనపర్తి అడిషనల్ కలెక్టర్



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామిని వనపర్తి అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు చక్రపాణి జోషి, ఆలయ ధర్మకర్త గిరిరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి కవితలు ఘనస్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకోవడం తోపాటు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

మల్దకల్: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత సూచించారు. శుక్రవారం మల్దకల్‌లోని ఓ పాఠశాలలో గ్రీన్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలలో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. రాజశేఖర్‌రెడ్డి, గోవిందు, యోసేపు, రాజరత్నం, మధు, జయనందం, ప్రిన్సిపాల్ శ్వేతారాణి, రాజశేఖర్ పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6111

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శుక్రవారం 295 క్వింటాళ్ల వేరుశనగ రాగా, క్వింటాకు గరిష్టం రూ.6111, కనిష్టం రూ.3200, సరాసరి రూ.5099 ధరలు లభించాయి. అలాగే, 5 క్వింటాళ్ల ఆముదం రాగా, క్వింటాకు గరిష్టం, కనిష్టం, సరాసరి ధర రూ.5319 ధర వచ్చింది.

కవి సమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణ



స్టేషన్ మహబూబ్‌నగర్: 'పాలమూరు జలహారం– కరువు నేల' జలదృశ్యం అ అనే అంశంపై ఈనెల 24న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా కవులు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని లుంబిని స్కూల్‌లో శుక్రవారం కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవి సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, ప్రజాకవి గోరటి వెంకన్న, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.విజయ్ కుమార్, కె.లక్ష్మణ్‌గౌడ్, బోల యాదయ్య, కేపీ.లక్ష్మీనరసింహ, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2న ప్రధాని మోదీ సభ

పాలమూరు: అక్టోబర్ 2న మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి వెల్లడించారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో బూత్ స్వశక్తికరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సభను విజయవంతం చేయడానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జన సమీకరణకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జ్‌గా కేఎస్ రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. వారం రోజుల పాటు బూత్‌స్థాయిలో చేయాల్సిన కార్యక్రమాలపై మండల అధ్యక్షులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, పడకుల బాలరాజు, క్రిస్టియనాయక్, కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రతంగ్ పాండురంగారెడ్డి, అంజయ్య, నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి



బుడమొర్సులో డ్రమ్ములోని నీటిని పారబోస్తున్న జెడ్పీ సీఈఓ ముషాహిదాబేగం, అధికారులు

శాంతినగర్: గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోగాల బారిన పడవద్దని జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ముషాహిదాబేగం సూచించారు. డ్రై డే సందర్భంగా వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సు గ్రామాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఇళ్ల ముందు డ్రమ్ముల్లో నిల్వ వుంచిన నీటిని పారబోయించారు. గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్‌ను సందర్శించి తడిచెత్త, పొడిచెత్త వేరు చేసే విధానాన్ని పరిశీలించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర, సర్పంచ్ తిమ్మప్ప, ఎంపీఓ తిరుపతన్న, ఏపీఓ విజయలలిత, పంచాయితి కార్యదర్శి సత్యకి, గ్రామ పంచాయితి సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీపీకి అదనపు బాధ్యతలు

గద్వాల క్రైం: గద్వాలలోని ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్(పోక్సో) కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆనంద్‌కుమార్ జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ వైజయంతి ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఇక్కడి కోర్టులో పీపీగా విధులు నిర్వహిస్తున్న మంజులాదేవి ఇటీవల రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.

దోమల నివారణకు చర్యలు షురూ..



గద్వాలలోని కుంటవీధిలో ఇళ్ల మధ్య పేరుకున్న మురుగులో ఆయిల్‌బాల్స్ వదులుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గద్వాల: పట్టణాల్లో పారిశుద్ధ్య లోపంతో దోమలు, వాటి సంతతి అసాధారణంగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో మలేరియా, డెంగీ లాంటి ప్రాణంతక వ్యాధులు బెంబేలెత్తిస్తున్నాయి. దీనిపై 'భయపెడుతున్న డెంగీ' శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం అయింది. 'సాక్షి' కథనానికి గద్వాల మున్సిపల్ యంత్రాంగం స్పందించింది. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, కమిషనర్ నర్సింహలు పారిశుద్ధ్య సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. దోమల ఉధృతికి అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలలో నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పారిశుద్ధ్య సిబ్బంది దోమల నివారణ చర్యలలో పాల్గొన్నారు. పట్టణంలోని శివారు ప్రాంతాలు, ఖాళీ స్థలాలు, లోతట్టు ప్రాంతాల్లో పేరుకపోయ్యే వ్యర్థాలను గుర్తించి తొలగించారు. సాయంత్రం వేళ ఫాగింగ్ చేశారు. సమస్యాత్మక ప్రాంతాలలో యాంటీలార్వా ఆపరేషన్‌లో భాగంగా ఆయిల్ బాల్స్ వదలడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, మలాథిన్ రసాయనాలను స్ప్రే చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ నర్సింహా తెలిపారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో మౌళిక సదుపాయాలను కల్పించి అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. శుక్రవారం ఇటిక్యాలలో రూ. 2.12 కోట్ల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆకలి చావులు అధికంగా ఉండేవని, ప్రస్తుత బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కూడా ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. కానీ మన రాష్ట్రంలో ప్రజల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. అలాగే దేశంలో ఎక్కడాలేని విధంగా రైతుల సంక్షేమమే ధ్యేయంగా రైతు బీమా, రైతు బంధు, రుణమాఫీ పథకాలను ప్రవేశపెట్టి రైతు ప్రభుత్వంగా పేరుగాంచిందన్నారు.



ఇటిక్యాలలో సీసీ రోడ్డు పనులను భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

పల్లెలను అభివృద్ధి చేయడం కోసం ప్రతి గ్రామానికి రోడ్డు వసతిని కల్పించేందుకుగాను బీటీ, గ్రామాల్లో అంతర్గత రోడ్లకు సీసీ రోడ్లను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, కృష్ణసాగర్, యుగంధర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, రాఘున్న ఉన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజోళి: చేనేత సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సభ్యులు కోరారు. శుక్రవారం మండల కేంద్రం రాజోళిలోని చేనేత సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో కొత్తగా వచ్చిన మగ్గాలను అందుబాటులోకి తీసుకురావాలని, వాటి ద్వారా మగ్గంలో సులువుగా నేసేందుకు వీలవుతుందని సభ్యులు కోరారు. కాగా ప్రస్తుతం మార్కెట్‌లో అమ్మకాలు మందకొడిగా సాగుతున్నందున, ఆశించిన లాభాలు లేవని, అమ్మకాలు పెరిగితే వాటికి తగ్గట్లుగా కొత్తరకం మగ్గాలను అందుబాటులోకి తెస్తామని కమిటీ పేర్కొంది. సంఘంలో ఉండి జియో ట్యాగింగ్ లేని వారి పట్ల ప్రభుత్వ వైఖరి ఏంటనేది స్పష్టత లేదని దానిపై కూడా పూర్తి స్థాయిలో స్పష్టత తీసుకోవాలని తెలిపారు. కార్మికులు మరణిస్తే వచ్చే బీమా సొమ్ములో కూడా జాప్యం జరుగుతుందని, ఆ జాప్యాన్ని నివారించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దోత్రే నారాయణ, ఉప సర్పంచ్ గోపాల్, శ్రీను, సంఘం సభ్యులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దోత్రే నారాయణ

నెలాఖరునాటికి రుణమాఫీ పూర్తి

- మిగిలిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి
- రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి



గద్వాల ఎస్‌బీఐలో రుణమాఫీ ప్రక్రియకు సంబంధించి ఆరా తీస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్/ధరూరు: రుణమాఫీ ప్రక్రియను ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం ఆమె గద్వాల, ధరూరులోని బ్యాంకులను సందర్శించి రుణమాఫీ ప్రక్రియ తీరుతెన్నులను పరిశీలించారు. బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్లతో మాట్లాడుతూ.. రుణ మాఫీ ప్రక్రియ వేగవంతం చేయాలని, బ్యాంకు పరిదిలో ఇప్పటి వరకు ఎంత మందికి ఎంత మేర మాఫీ అయ్యిందనే దానిపై ఆరా తీశారు. ఇంకా మిగిలిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని, వీలైతే ప్రత్యేక కంటర్ ఏర్పాటు చేయాలన్నారు. కొత్త రుణం తీసుకోవాలనుకున్న రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు రుణ మాఫీపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, డీఏఓ గోవిందునాయక్, ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్లు రతన్‌కుమార్, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ కుమార్ ఫీల్డ్ ఆఫీసర్లు ముఖేది షేక్ హుస్సేని తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు చేయూత..

చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో చేనేత కార్మికసంఘ నాయకులు, మాస్టర్‌వీవర్స్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత మిత్ర అకౌంట్‌కు చేనేత కార్మికులు ఈకేవైసీ అనుసంధానం చేయాలన్నారు. అదేవిధంగా పెన్షన్, స్కిల్‌డెవలప్‌మెంట్, సమర్థ ట్రైనింగ్, లోన్‌వీవర్ సమాచారం తదితర అంశాలపై చర్చించారు. చేనేత జౌళిశాఖ ఏడీ గోవిందయ్య, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్, మహేష్; అక్కలశ్రీనివాస్, అక్కల శాంతారామ్, సురేష్ పాల్గొన్నారు.


డ్రగ్స్ కట్టడికి కఠిన చర్యలు

డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. డ్రగ్స్ నిర్మూలన అంశాలపై ఎస్పీ సృజనతో కలిసి సమీక్షించారు. జిల్లాలో ఎక్కడైన గంజాయి సాగు చేస్తే ఆయా ప్రాంతాలును గుర్తించి వాటికి అడ్డుకట్ట వేయాలని, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా గ్రామాల్లో కళాజాత బృందాలచే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆర్డీవో చంద్రకళ, అటవీశాఖ అధికారి ఎండీ జాకీరుద్దీన్, రాజు, ఎక్సైజ్ సీఐ పటేల్, డ్రగ్స్‌కంట్రోల్ అధికారి మహ్మద్ రఫీ, డీఈఓ సిరాజుద్దీన్, డీడబ్ల్యూవో ముషాయిదాబేగం తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

రైతులకు తగినంత యూరియా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం ధరూరులోని సింగిల్ విండో ద్వారా అందిస్తున్న యూరియా స్టాక్‌ను పరిశీలించారు. నిర్ధేశించిన ధరలకే అమ్మకాలు జరపాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలాఉండగా, ధరూరు పర్యటన ముగించుకొని వెళ్తున్న కలెక్టర్ మండల శివారులో బోయ రైతు రఘు రెండెకరాల్లో సాగు చేసిన సీడ్ పత్తి పంటను పరిశీలించారు. పంట సాగు కోసం ఎంత ఖర్చు అయ్యిందని ఆరా తీయడమేగాక మహిళా కూలీలతో కూలి ఎంత ఇస్తున్నారు.. గిట్టుబాటు అవుతుందా అని మాట్లాడారు.


డిపోను మరింత లాభాల్లోకి తీసుకెళ్లాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో నష్టాలను అధిగమించి లాభాల్లోకి వచ్చిందని, డిపోను మరింత లాభాల్లోకి తీసుకురావాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం ఉత్తమ ఉద్యోగుల అభినందనసభ నిర్వహించారు. గత నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆదాయం సాధించిన 10 మంది కండక్టర్లు, కేఎంపీఎల్ సాధించిన 10 మంది డ్రైవర్లతో పాటు ఇద్దరు మెయింటెనెన్స్ సిబ్బందిని ఆర్‌ఎం అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహబూబ్‌నగర్ డిపో లాభాలను పొంది రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని, ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు కష్టపడి పని చేయాలని కోరారు. ఆర్టీసీ పట్ల ప్రయాణికులకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌ఐ సుధా మాధురి, డిపో మేనేజర్ సుజాత, అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్, కోడూరు శ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో గట్టు అభివృద్ధి

గట్టు: అభివృద్ధి పరంగా గట్టును గట్టెక్కిద్దామని, దీనికి అందరి సహకారం తప్పని సరి అని డీఆర్‌డీఓ ఉమాదేవి అన్నారు. శుక్రవారం గట్టు మండల పరిషత్ కార్యాలయంలో వెనుకబడిన మండలాల అభివృద్ధి (ఆస్పిరేషన్ బ్లాక్) సన్నాహక సమావేశాన్ని అన్ని శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఉమాదేవి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశం మొత్తంలో వెనుకబడిన 500 మండలాలను ప్రకటించగా, అందులో గట్టు మండలం ఉందని తెలిపారు. నీతిఅయోగ్ గుర్తించిన వివిధ అంశాల ఆధారంగా దేశంలో అత్యంత వెనుక బడిన మండలాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. వీటి అభివృద్ధికి వంద శాతం నిధులను సమకూర్చుతున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా యంత్రాంగం సహకారంతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్య, గ్రామీణ అభివృద్ధి వంటి అనేక సూచికలపై వారి పని తీరు ఆధారంగా ప్రతి నెలా బ్లాక్‌ల ర్యాంక్‌ను కేటాయిస్తున్నట్లు ఎంపీపీ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుమతి, మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ కమలాదేవి, ఎంపీడీఓ చెన్నయ్య, ఎంపీఓ మహేష్, ఏపీఓ ప్రసాద్, సర్పంచు ధనలక్ష్మీ పాల్గొన్నారు.



గట్టులో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ ఉమాదేవి

29న వనపర్తికి మంత్రి కేటీఆర్ రాక

వనపర్తి: జిల్లా కేంద్రానికి ఈ నెల 29న రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ రానున్నారని, రూ.666 కోట్లతో చేపట్టిన 24 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం వనపర్తిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహల్‌కు పూర్వవైభవం తీసుకొచ్చి, నాగవరం శివారులో రూ.10 కోట్లతో ఐటీ టవర్ నిర్మించి జిల్లా చిహ్నాలుగా భవిష్యత్ తరాలకు గుర్తుండిపోయేలా చేస్తామని వివరించారు. అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులకు తొలివిడత ఇంటి స్థలాలను నాలుగు రోజుల్లో పంపిణీ చేస్తామని.. మిగిలిన వారికి బీపీఎల్ కోటాలో ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు.

క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి

నవాబుపేట: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని మరికల్‌లో చోటుచేసుకుంది. ఈ సంఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. మరికల్‌కు చెందిన చిట్టెల సాయిలు(55) గురువారం గ్రామ సమీపంలోని చెరువులో స్నానం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. అయితే కుటుంబ సభ్యులకు ఆయన ఎక్కడి వెళ్లింది తెలియకపోవడంతో చుట్టుపక్కల వెతికినా లాభం లేకపోయింది. కాగా శుక్రవారం చెరువులో ఆయన శవమై కనిపించడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై సాయిలు కూతురు అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

కుంటలో పడి మహిళ..

బల్మూర్: మతిస్థిమితం లేని ఓ మహిళ కుంటలో పడి మృతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలోని కొండనాగులలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సాలమ్మ(43)కు కొన్నేళ్ల క్రితం కర్నూలు జిల్లాకు చెందిన కృష్ణయ్యతో వివాహం కాగా కొండనాగులలోనే ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే సాలమ్మ కొన్నాళ్ల నుంచి మతిస్థిమితం కోల్పోయి ఎక్కడికి అంటే అక్కడికి వెళ్తుండగా వెతికి తీసుకువచ్చేవారు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన తన భార్య కనిపించక పోవడంతో బంధువులు, సమీప గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామ సమీపంలోని మొగుళ్లకుంటలో మహిళ మృతి చెంది ఉందని గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో వెళ్లి సాలమ్మగా గుర్తించారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. గుడెబల్లూర్‌కు చెందిన యరబాపు తిమ్మప్ప (34) తన స్నేహితుడి ద్విచక్ర వాహనం తీసుకొని టైరోడ్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి స్వగ్రామానికి వస్తుండగా, గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సోనీతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఫెయిల్ కావడంతో.. విద్యార్థి బలవన్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: డిప్లొమాలో రెండు సబ్జెక్టులు ఫెయిల్ అవడంతో మనస్థాపానికి గురై ఓ విద్యార్థి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. హన్వాడ మండలం టంకరకు చెందిన కుర్మయ్య పట్టణంలోని న్యూగంజ్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ బోయపల్లి గేట్‌లో టైలర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయన కుమారుడు ఉదయ్‌కుమార్ (22) జేపీఎన్‌సీఈలో డిప్లొమా చదివేవాడు. ఇటీవల జరిగిన పరీక్షల్లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, స్నేహితులు కిందకు దించి జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

వేధింపులు తాళలేక.. ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం: లైంగిక వేధింపులు తాళలేక మహిళా ఉద్యోగిని ఆత్మహత్యకు యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలో నివాసముంటూ మల్దకల్ మండలంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న మహిళను ఓ యువకుడు నిత్యం లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. గురువారం సాయంత్రం ఇంట్లో పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. మహిళా ఉద్యోగిని ఆత్మహత్యకు యత్నించిన ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సరిహద్దు జిల్లా పోలీసుల భేటీ

● రాబోయే ఎన్నికల ఏర్పాట్లపై సమాలోచన


కల్వకుర్తి డీఎస్పీ కార్యాలయంలో జిల్లా సరిహద్దు పోలీసు అధికారులు

కల్వకుర్తి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై పోలీసులు దృష్టిసారించారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్ వస్తుందన్న తరుణంలో పోలీసు అధికారులు సన్నద్ధమవుతున్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దు నాలుగు జిల్లాల పోలీసు అధికారులతో కల్వకుర్తి డీఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ ఎస్పీలు మనోహర్, కె.నరసింహతో పాటు ఇంబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాసరావు, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలపాటు జరిగిన సమావేశంలో రాబోయే ఎన్నికల కోసం పోలీసులు చేయాల్సిన ఏర్పాట్ల ప్రధానంగా చర్చించారు. సరిహద్దులో ఎక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి.. అక్రమ మద్యం.. డబ్బులు తరలింపు, సరఫరా అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో సమాలోచనలు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి చెప్పారు. సరిహద్దులో సమన్వయంతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత ఎన్నికల్లో తీసుకున్న చర్యలు లోటుపాట్లతోపాటు ఎక్కడ చెక్‌పోస్టుల ఏర్పాటు చేశారో చర్చించారు. ఎన్నికలకు పోలీసు సిబ్బంది కేటాయింపు, టీంలు, నిర్వహణపై సమాలోచనలు చేశారు. రాబోయే ఎన్నికలకు సన్నద్ధం కావడానికి అన్ని ఏర్పాట్లపై సమన్వయం చేసుకోవాలని నిర్ణయించారు. ప్రధానంగా జిల్లా సరిహద్దుల పోలీసు ఎప్పటికప్పుడు చర్చించుకోవడంతో సమాచారాన్ని చేరవేసుకోవాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కల్వకుర్తి, వెల్దండ, దేవరకొండ, మాడ్గుల సీఐలు ఆంజనేయులు, సోమనర్సయ్య, సురేష్, రాజశేఖర్, ఎస్‌ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టడంలో కేసీఆర్ దిట్ట

● ఎన్నికల కోసమే హడావుడిగా 'పాలమూరు' ప్రారంభోత్సవం
● మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి


పాలమూరు ప్రాజెక్టు డెలివర్ పంపును పరిశీలిస్తున్న నాగం జనార్దన్‌రెడ్డి

కొల్లాపూర్ రూరల్: ప్రజలను మభ్యపెట్టడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిట్ట అని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని ఎల్లూరు శివారులో ఉన్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల కోసమే హడావిడిగా పాలమూరు ప్రాజెక్టును ప్రారంభించారని, 20 శాతం పనులు కూడా పూర్తి కాకుండా ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు. తూతూమంత్రంగా రెండు, మూడు గంటలు మాత్రమే మోటార్లు నడిపి పాలమూరు సస్యశ్యామలమైందని గొప్పలు చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మోటారు ప్రారంభిస్తేనే పండుగ కాదని.. పొలాలకు ఎత్తిపోతల నీరు పొలాలకు అందినప్పుడే రైతన్నలకు అసలైన పండుగని తెలిపారు. ప్రాజెక్టు పనులు మొదలు పెట్టిన నాడు 30 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారని.. 90 నెలలు గడిచినా నేటికీ కట్టలు, కాల్వల నిర్మాణాలు పూర్తి కాలేదని వివరించారు. ప్రాజెక్టు పంపుల కొనుగోలులో సుమారు రూ.5,500 కోట్ల అవినీతి జరిగిందని.. హైకోర్టులో కేసు కూడా వేసినట్లు తెలిపారు. మిగిలిన ఎనిమిది పంపుల ప్రారంభం ఎప్పుడు? నిర్వాసితులు ప్రతి ఇంటికి ఓ ఉద్యోగం హామీ ఎప్పుడు నెరవేరుస్తారో సమాధానం చెప్పాలని కోరారు. కృష్ణా బోర్డులో తెలంగాణ నీటి వాటా దాదాపు 574 టీఎంసీలు కాగా.. 294 టీఎంసీలు చాలని సంతకం చేసింది మరిచావా అని ముఖ్యమంత్రిని విమర్శించారు. ఎల్లూరు వద్ద కేఎల్‌ఐ పంపు, మోటార్లు మరమ్మతుకు గురికావడానికి అసలు కారణం పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించిన అండర్ గ్రౌండ్ పంప్ హౌజ్ నిర్మించడమేనని చెప్పుకొచ్చారు. కేఎల్‌ఐకి సంబంధించిన రెండు, మూడో పంపు నేటికీ నడవడం లేదని తెలిపారు. అంతకుముందు పాలమూరు ప్రాజెక్టు డెలివరీ పంపులు, ప్రధాన కాల్వ, హెడ్ రెగ్యులేటరీని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవి, బాలగౌడ్, పాండు, కోటయ్య, ఐతోల్ లక్ష్మయ్య, సంతోష్‌రావు, మిద్దె రాములు, బంగారి పర్వతాలు, తిరుపతమ్మగౌడ్, కృష్ణయ్యగౌడ్, అవినాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆకస్మిక తనిఖీ


జీసీసీ గోదాంలోని సరుకులను పరిశీలిస్తున్న అధికారులు

మన్ననూర్: స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల, జీసీసీ నిర్వహణ తీరుపై నర్సింహ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర ప్రాంతీయ నిఘా అధికారి ఫజురుల్ రహమాన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జీసీసీ పరిధిలోని 150 వసతి గృహాలకు సరుకుల సరఫరాకు సంబంధించిన వివరాలు బ్రాంచ్ మేనేజర్ సంతోష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జీసీసీ ఉద్యోగుల పనితీరు, ప్రావీణ్యత, నైపుణ్యంతో పాటు జీసీసీ ద్వారా కొనుగోలు చేస్తున్న అటవీ ఉత్పత్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ముష్టి గింజలు ఏడాదికి 300 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తామని, చెంచుల నుంచి కొనుగోలు చేసిన చింతపండు ఇక్కడే శుద్ధిచేసి వసతి గృహాలకు సరఫరా చేస్తామని బ్రాంచ్ మేనేజర్ వివరించారు. ఫుడ్ పాయిజన్ ఘటనపై గిరిజన పాఠశాల, వసతిగృహ ఉద్యోగులు, అధికారులతో సమావేశమయ్యారు. రోజువారీగా విద్యార్థులకు అందించే ఆహారం, మెనూ, తాగునీరు, సరుకుల కొనుగోలుకు సంబంధించి గతేడాది ఏడాది నుంచి రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులు ఇంటిబాట పడుతుంటే నియంత్రించే ప్రయత్నాలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తిరిగి ఎప్పటి వరకు పాఠశాలకు వస్తారని ఇన్‌చార్జ్ వార్డెన్ తిరుపతమ్మను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీఎస్ అధికారి సురేష్, పోలీస్‌శాఖ నుంచి అప్పయ్య, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ నుంచి విజయ్‌కుమార్, అటవీశాఖ అధికారి ఎల్.రమేష్, జీసీసీ అకౌంటెంట్ జయరాజ్, రాములు, రమణ తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో వేట

● చుక్కలదుప్పిని హతమార్చిన వేటగాళ్లు
● నలుగురిపై కేసు నమోదు



అమ్రాబాద్: నల్లమలలో అటవీ జంతువుల వేట సాగుతోంది. శుక్రవారం తెల్లవారుజామున చుక్కల దుప్పిని హతమార్చిన వేటగాళ్లు.. దాన్ని చర్మం వలుస్తూ అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డారు. ఎఫ్ఆర్ఓ ప్రభాకర్, డీఆర్ఓ లక్ష్మీకాంతారావు వివరాల మేరకు.. అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ బీకే తండాకు చెందిన దేశావత్ గోపాల్, గంటల సోమ్లా, దేశావత్ ధర్మ, సోమ్లా అటవీ జంతువుల వేట కోసం తాటిగుండంచెలుక ప్రాంతంలో ఉచ్చు ఏర్పాటు చేశారు. లాగారు. చుక్కల దుప్పి ఉచ్చులో చిక్కి మృతి చెందింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఎఫ్ఆర్ఓ ప్రభాకర్, ఎఫ్ఎస్ఓ మల్లికార్జున్, ఎఫ్‌బీఓ శారద సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో నలుగురు నిందితులు దుప్పి చర్మం వలుస్తూ పట్టుపడ్డారు. దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకుని.. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. శనివారం కోర్టులో హాజరు పర్చనున్నట్లు పేర్కొన్నారు.

మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ కోటా ఇవ్వాల్సిందే

● ఉమ్మడి జిల్లా బీసీ సమాజ్ కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్


మాట్లాడుతున్న శ్రీనివాస్ సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: చట్టసభల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ రూపొందించిన బిల్లును కేంద్ర మంత్రివర్గం ఆమోదించినందుకు కృతజ్ఞతలని, ఈ బిల్లులో ఓబీసీ కోటా నిర్ణయించి అమలు చేసేలా కృషి చేయాలని ఉమ్మడి జిల్లా బీసీ సమాజ్ కన్వీనర్ ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు నియోజకవర్గాల్లో మాత్రమే మహిళలకు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం దక్కిందన్నారు. మిగతా వాటిలో ఒక్కరికి కూడా అవకాశం రాలేదన్నారు. జనాభా దామాషా ప్రకారం కచ్చితంగా ఓబీసీ కోటాలో మహిళా రిజర్వేషన్లు ఉండాలని, వీలైనంత తొందరగా బిల్లును అమలు చేయాలని కోరారు. సమావేశంలో బీసీ సమాజ్ కోకన్వీనర్ సత్యం సాగర్, జి.ఆశన్న ముదిరాజ్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా గంజాయి విక్రయాలు

● యువత, కార్మికులే లక్ష్యం?

అడ్డాకుల: పట్టణాలకే పరిమితమైన గంజాయి విక్రయాలు క్రమేపీ మండలాలు, గ్రామాలకు చేరువవుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. యువత, కార్మికులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. అడ్డాకుల వద్ద ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తూ పట్టుబడటమే ఇందుకు నిదర్శనం. అడ్డాకులతో పాటు మూసాపేట మండలంలోనూ గంజాయి విక్రయాలు జోరుగా కొనసాగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పల్లెలకు పాకడంతో విద్యార్థులు, యువకుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఇతర రాష్ట్రాల నుంచి రెండు మండలాల్లోని పరిశ్రమల్లో పని చేయడానికి వచ్చిన కార్మికులు గంజాయి కోసం ఎగబడుతుండటం వ్యాపారులకు వరంగా మారిందని సమాచారం. పోలీసులు నిఘా ఉంచి పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇద్దరు రిమాండ్‌కు..

అడ్డాకుల: మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన ఇద్దరిని శుక్రవారం మహబూబ్‌నగర్ కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. పంజాబ్‌కు చెందిన రవిసింగ్‌తో పాటు మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు కలిసి గురువారం గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

యువత చెడుదారి పట్టొద్దు

గంజాయితో యువత చెడుదారి పట్టే అవకాశం ఉంది. గంజాయి విక్రయాలపై దృష్టి సారించి విక్రేతలపై కఠినంగా వ్యవహరిస్తాం. ఎవరికైనా విక్రయాల గురించి తెలిస్తే సమాచారం ఇవ్వాలి.

– మాధవరెడ్డి, ఎస్‌ఐ, అడ్డాకుల

ఆలయంలో హుండీ చోరీ

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీని పగులగొట్టి డబ్బులను చోరీ చేశారు. విషయాన్ని గమనించిన పూజారి కమ్మరిశిల్పి వెంకటాచారి పోలీసులకు పిర్యాదు చేసారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

కంటైనర్, లారీ ఢీ: తప్పిన ప్రమాదం


ఘటనా స్థలంలో కంటైనర్, లారీ

భూత్పూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం కంటైనర్, లారీ ఢీకొనడంతో ఇరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. దివిటిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై భూత్పూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మూడు కిలోమీటర్ల మేర మూడు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో మిగిలిన వాహనదారులు భూత్పూర్, పాలకొండ బైపాస్ మీదుగా జడ్చర్ల వైపు వెళ్లడం ప్రారంభించారు. ఓ కంటైనర్ డ్రైవర్ భూత్పూర్ పోలీస్‌స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో కంటైనర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులకు ట్రాఫిక్ జామ్ కాకుండా వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించారు.

పీయూలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి భారత ప్రభుత్వరంగ సంస్థ ఇంజినీరింగ్ ప్రాజెక్టు ఇండియా లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా పీయూలో సంస్థ ప్రతినిధులు, అధికారులు ఒప్పంద పత్రాలను ఒకరికొకరు అందజేసుకున్నారు. పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించేందుకు ఇక్కడ నిర్మించే మైదానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ, రవీందర్‌నాథ్, ఎంజీఎం నారాయణనాయక్, దేవీదాస్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు తగ్గిన వరద

ధరూరు: జూరాల ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతం నుంచి వరద తగ్గింది. శుక్రవారం ప్రాజెక్ట్‌కు వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 115, భీమా లిఫ్ట్–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731 క్యూసెక్కులతోపాటు ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులతో కలిపి మొత్తం 3,691 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.651 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో 853.7 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 853.7 అడుగుల వద్ద 88.4734 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,500, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,887, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 735, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకెఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 1.024 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తూ, 1,946 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు.

రామన్‌పాడులో 1,020 అడుగులు..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,030, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్టీఆర్ కాల్వతో వ్యవసాయ అవసరాల కోసం వెయ్యి క్యూసెక్కులు, కుడి కాల్వకు 10, ఎడమ కాల్వకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్–2 నుంచి 851 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనిల్‌రెడ్డి తెలిపారు.

వనపర్తి కలెక్టరేట్ ఉద్యోగి హఠాన్మరణం


రవి రాథోడ్ (ఫైల్)

పెబ్బేరు రూరల్: కలెక్టరేట్‌లో ఓ ఉద్యోగి గుండె పోటుతో మృతి చెందాడు. సహచర ఉద్యోగుల వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం ఉప్పితండాకు చెందిన రవి రాథోడ్ (45) వనపర్తి కలెక్టరేట్‌లోని ట్రెజరీశాఖ కార్యాలయంలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. శుక్రవారం విధినిర్వహణలో ఉండగా.. గుండెపోటు రావడంతో తోటి ఉద్యోగులు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

హన్వాడ: విధులకు ఆటంకం కలిగించాడని తహసీల్దార్, ఎంపీడీఓలు ఓ వ్యక్తిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపీడీఓ ధనుంజయగౌడ్ సిబ్బందితో కలిసి మండలంలోని ఎల్లంబాయితండాకు వెళ్లారు. పంచాయతీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న క్రమంలో తండాకు చెందిన రమేష్‌నాయక్ అతివేగంగా కారు డ్రైవ్‌చేస్తూ అధికారుల పక్క నుంచి వెళ్లాడు. భయాందోళనకు గురైన అధికారులు, సిబ్బంది కారును నిలిపి అతడిని మందలించారు. దీంతో కోపోద్రిక్తుడైన రమేష్‌నాయక్.. అధికారులపై ఎదురు తిరిగి వారి విధులకు ఆటంకం కలిగించడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు.

మత్స్యకారులను ఆదుకుంటున్న బీఆర్‌ఎస్


మాట్లాడుతున్న సత్యనారాయణ

భూత్పూర్: తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులను అన్నివిధాలుగా ఆదుకుంటూ ప్రోత్సహిస్తోందని మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మనిమోని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన జాతీయ మత్స్యకారుల సంఘం సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ మత్స్యకారుల అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. మత్స్యకారులకు 75 శాతం రాయితీతో సామగ్రి, 100 శాతం రాయితీతో చేప పిల్లలు అందిస్తున్నారన్నారు. మత్స్యకారులకు రూ.5 లక్షల బీమా వర్తింపజేయాలని సభ తీర్మానించిందని.. రాష్ట్ర ప్రభుత్వాలకు తీర్మాన ప్రతులను పంపాలని సభ కోరినట్లు తెలిపారు.

గంగమ్మ ఒడికి గణపయ్యలు..


● బీచుపల్లిలో ఘనంగా నిమజ్జనం


నిమజ్జనానికి తరలిన గణనాథుడు


శోభాయాత్రలో చిందులేస్తున్న యువకులు

ఎర్రవల్లిచౌరస్తా: గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం బీచుపల్లి కృష్ణానదిలో గణనాథులను నిమజ్జనం చేశారు. ఇటిక్యాల మండలంలోని గ్రామాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల గ్రామస్తులు, యువకులు సాయంత్రం మండపాల్లో లడ్డూ వేలం నిర్వహించారు. అనంతరం పిల్లలు, పెద్దలు భజనలు, నృత్యాలు చేసుకుంటూ వాహనాల్లో ఊరేగింపుగా బీచుపల్లి కృష్ణానదికి చేరుకొన్నారు. గజ ఈతగాళ్ల, అధికారుల సమక్షంలో క్రేను సాయంతో గణనాథులను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఆయా శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జాం కాకుండా ఎస్‌ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించారు.




కృష్ణానదిలో నిమజ్జనం అవుతున్న గణపయ్యలు